# తగిన శాస్త్రి

రచన:
ఏ. యస్. రామారావు

ఆఫీసునుంచి తిన్నగా రూముకు వచ్చి తలుపు తెరిచేసరికి డిటెక్టివ్ వేణుకి తెల్లని కవరొకటి కనిపించింది. కవరు తీసిచూసేడు. కవరుమీద ఎడ్రసులేదు. కవరుచింపి లోపల కాగితాన్ని చూసుకున్నాడు. కాగితంమీద "జాగ్రత్త" అని మూడే మూడక్షరాలు ముత్యాల్లా వ్రాసి వున్నాయి. అంతకుమించి ఆ కాయితంలో యింకేంలేదు. ఎవరు వ్రాసారు? ఎక్కణ్ణుంచి వ్రాసారు? ఎందుకువ్రాశారు? మొదలైన ప్రశ్నలు ఒకదానివెంట మరొకటి వరుసగావచ్చి వేణుమనస్సుని కలతపరచేయి.

వేణుస్వతహగా డిటెక్టివ్‌కాదు. కాని అన్నిరకాల అర్థరూపాయి డిటెక్టివ్ సాహిత్యాన్ని ఆమూలాగ్రంగా చదివి వాటిమీద తనూ చాలావరకు రిసెర్చిచేసి చాలాగొప్ప విజ్ఞానాన్ని సంపాదించుకున్నానని చాలామందితో చెప్తూండేవాడు. కానన్‌డాయిల్‌తో పోల్చుకుంటుండే వాడుకూడా. తనలా అనుకుంటూండడానికి కారణాలు లేకపోలేదు.

తన డిటెక్టివ్ విజ్ఞానాన్ని ప్రదర్శించుకోడానికి అవకాశాలుకూడా లభించేయి. తనఆఫీసరు జేబులో పెన్ను కనిపించకపోతే వేణు వెతికి ఆఫీసరుకు అందజేసేడు. ఎదురింట్లో లెక్చరరుగారి అమ్మాయి కమల నెక్లసు పోతే పట్టిఇచ్చేడు. ఈ విజయాలకి కారణం తనిన్నాళ్లూ స్టడీచేసిన డిటెక్టివ్ సాహిత్యం తాలూకు ఘనతనే అతని గట్టినమ్మకం. ఆపుస్తకాలనీ, వాటి రచయితల్ని ఎంతగానో అభినందించుకునే వాడు మనసులో. వేణుచేసిన ఈ ఘనకార్యాలకి అతణ్ణందరూ డిటెక్టివ్ వేణు అని పిలుస్తూండేవారు.

అలాంటి తననే భయపెట్టుతూ వ్రాసిన కాగితంవైపు తీక్షణంగా ఓ సారి చూసి, పరిహాసం చేస్తున్నట్లు ఒకనవ్వు విసిరేడు.

రూంకువస్తూ హొటల్‌నుంచి తెచ్చుకున్న టిఫిన్ కాస్తతిని గ్లాసుడు మంచినీళ్లు, ఆపైన ఫ్లాస్కులోని కాఫీని సేవించి, కత్తిరమార్కు పెట్టెలోని చార్‌మీనార్ సిగరెట్టుని ముట్టించి ఘాటుగా ఒక్క దమ్ములాగే సరికి తకీమని బుర్రలోకి ఏదో ఆలోచన హఠాత్తుగావచ్చింది. బీరువాలోంచి మైక్రోస్కోపుతీసి కాగితాన్ని జాగ్రత్తగా పరిశీలించేడు. ఏమనుకున్నాడో ఏమో వెకిలిగా ఒకనవ్వు నవ్వి ఆ కాగితాన్నలానే దీక్షగాచూస్తూ ఆలోచిస్తూ వుండిపోయేడు.

"ఏమండీ డిటెక్టివ్‌గారూ! నాన్నగారు చదరంగం ఆడటానికి త్వరగా రమ్మంటున్నారు" అని గుమ్మంలో నుంచే నాలుగు మాటలు నాజూగ్గా చెప్పేసి తుర్రునపారిపోయింది లెక్చరరు గారమ్మాయి కమల.

కమలమాటలు చెవికి సోకేసరికి మళ్లీ ఈలోకంలో పడ్డాడు వేణు. గుమ్మంకేసి చూసేసరికప్పుడే అక్కణ్ణించి దాటేసింది కమల. కమల చేష్టలకి తనలో తనే నవ్వుకుని గదికి తాళంవేసి లెక్చరరుగారింటికి వెళ్లేడు వేణు.

కమల లెక్చరరుగారి పెద్దమ్మాయి. స్కూలుఫైనలు పాసయి ప్రస్తుతం ఇంట్లోనే వుంటోవుంది. సుమారు పద్దెనిమిదేళ్లుంటాయి. వయసుతో వచ్చిన అవయవ సౌష్టవంతో నిండుగా వుంటుంది. పైగా మంచిరంగులగల దేహం. వయసొచ్చినా ఆమెలో చిలిపితనం మాత్రం పోలేదు.

పాతిక సంవత్సరాలయినా నిండని వేణు వుద్యోగంకోసం ఆవూరువచ్చినప్పుడు తొలిపరిచయం లెక్చరరుగారితోనే అయింది. వేణుకోసం తొలిరోజుల్లో అన్ని సదుపాయాల్ని సమకూర్చిందాయనే. అప్పణ్ణుంచి, వేరేరూంలో వుంటున్నా, ఆఇంట్లో మనిషిలాగే మెలుగుతున్నాడు వేణు.

వేణు గ్రాడ్యుయేటు. లెక్చరరుగారికి తీరికలేని సమయాల్లో కమలకు అవీ ఇవీ చెప్తుండడం కద్దు. వారిద్దరి మధ్య ఈ పరిచయం ఒకవిధమైన అభిమానం. ఇంకా చెప్పాలంటే అనురాగానికి దారితీసింది. కాని, తమలోని భావాలు ఒకరికొకరు తెలియజేసుకోడానికి ఏ ఒక్కరికి ధైర్యం చాలటంలేదు. సమయంకోసం ఎదురు చూస్తున్నారేమో మరి!

లెక్చరరుగారికి అభిమాన పాత్రమైన చదరంగం ఆటలో వేణు నిగ్గుతేలిన ప్రవీణుడు. ఆనాటివరకు వేణుదే పైచెయ్యి. ఒక్కనాడుకూడా లెక్చరరుగారు వేణు ఆటను కట్టిన పాపాన పోలేదు. అలాంటిది, ఆనాడు వేణు వరుసగా మూడాటలూ ఓడిపోయాడు.

"అదేమిటోయ్! ఈ వేళ ఇలా ఆడుతున్నావ్?" అన్న లెక్చరరుగారి ప్రశ్నకు ఏం సమాధానం ఇవ్వాలో తోచలేదు వేణుకు. ఎలా తోస్తుందీ? మనస్సు ఆటమీద లగ్నమైతేగా? అతని మనస్సు మూడక్షరాల కాగితం ముక్కని గురించే ఆలోచిస్తూంది. ఆ కాగితం అంతుచూస్తేనే కాని అతని ఆత్మకు తృప్తి అంటూవుండదు.

"ఈ వేళకు ఆటచాలించేద్దామండి మాస్టారూ" అంటూ లేచాడు వేణు. లెక్చరరు సుబ్రమణ్యంగారు కూడా బలవంతం చెయ్యలేదు.

తిన్నగా హొటలుకుపోయి తొందరగా నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని ఇంటికి చేరుకున్నాడు. బట్టలు మార్చుకుని నిద్రపోవటానికి తయారుగా చేతివాచీతీసి టేబిలు మీద పెట్టబోయాడు. ఆశ్చర్యం! మళ్లా ఇంకొక కవరు. కవరుచించి కాయితం చదువుకున్నాడు.


"మిష్టర్ వేణూ!

కమలనుగూర్చి కలలుకంటున్నావు కాబోలు. కమల నాసొత్తు. ఆమె నన్ను ప్రేమించింది. మేం రేపురాత్రి సరిగా 12 గంటలకు పరారవుతున్నాం. మా గురించి వెతికినందువల్ల ప్రయోజనం ఏమీలేదు. ఈ రహస్యాన్ని ఎవరితోనైనా చెప్పటానికి ప్రయత్నించేవా! నీకూ, ఈ లోకానికి ఋణం తీరినట్లే. నీ నీడగా సంచరిస్తున్నాను. జాగ్రత్త!"

నీశ్రేయోభిలాషి.

ఒక్కొక్కమాటా చదువుతుంటే గుండె ఝల్లుమనేది వేణుకి. అదే దస్తూరీతో మరొకవుత్తరం. వేణుకేమీ అంతుచిక్కలేదు. అతని ఆలోచనలు పలువిధాలుగా సాగినాయి.

"తనింతకాలం కమలని ప్రేమిస్తున్నట్లు తనకు తప్పించి వేరొకరికి తెలియ



దాయె. కమలపై తనకుగల ఈ అనురాగాన్ని కనీసం మాటల సందర్భంలోనైనా తను కమలతో అనలేదు. పోనీ తనకు తెల్సిన వాళ్లలోగాని, కమల బంధువర్గంలోకాని, ఆమెకోసం కాచుకూర్చున్న వాళ్లెవరూ తనకు తెల్సినంతవరకూలేరు. వున్నదల్లా కమల మేనత్త కొడుకు మాత్రమే. అతనెక్కడో దూర దేశాల్లో ఏదో వుద్యోగం చేసుకుంటూ ఇటు ప్రక్కరావటం మానేసి చాలా ఏళ్లయింది. అతను వ్రాయడం సంభవం కాదు. మరయితే ఇంకెవరు వ్రాసినట్టు?" అర్థంలేని ఆలోచనతో పరిష్కారం కుదరక, నిద్రపట్టక సతమతమయ్యేడు వేణు.

"పోనీ సుబ్రమణ్యంగారితోచెప్పేస్తే" అనుకున్నాడు తనలో.

ఉత్తరంలో ఆఖరివాక్యాలు జ్ఞప్తికి వచ్చి భయంతో శరీరం కంపించింది వేణుకు. ఒక్కసారిగా గట్టిగా కళ్లు మూసుకున్నాడు వేణు.

తను చదివిన పుస్తకాల్లోని డిటెక్టివ్‌లందరూ ప్రత్యక్షమయ్యేరతనికి. "మరేం భయంలేదు. గుండెధైర్యంతో పనిచెయ్యి. విజయం సిద్ధిస్తుంది" అని భరోసా ఇచ్చినట్లయింది.

అంతమంది ఒక్కసారిగా వచ్చి తనకు ధైర్యం కలిగించటంతో వేణు మనసు కుదుటపడింది. ఎక్కడలేని ధైర్యం ఒక్కసారిగా కలిగిందతనికి. ఒక్కసిగరెట్టు ముట్టించి, ఘాటుగా దమ్ములాగి మరుచటి రాత్రి కార్యక్రమాన్ని సిద్ధపర్చుకుంటూ ఎప్పుడో నిద్రపోయేడు.

ఎప్పుడూలేనిది ఆరోజు సాయంత్రం తొందరగానే ఇల్లు చేరుకున్నాడు. గది తలుపులు గడియవేసి గదిలో దీపం ఆర్పేసి, కిటికీ తలుపులు కొద్దిగాతెరచి వుంచేడు. మధ్య మధ్య హుషారు పెంచుకోడానికి ప్లాస్కులోకాఫీ, సిగట్టు ఖర్చుచేస్తున్నాడు.

దూరంగా గంటస్తంభం గడియారం 12 గంటలు కొట్టినట్లయింది. తనచేతి గడియారం చూసుకున్నాడు. పిల్లికళ్లల్లా ఇరిడియం చుక్కలు. రెండుముల్లూ పన్నెండు మీదేవున్నాయి. ఆగంతకుడు రావాల్సిన టైం అయింది. ఎలుకకోసం కాచేపిల్లిలా కిటికీలోంచి సుబ్రమణ్యం గారింటి వైపే చూస్తూ నిల్చున్నాడు. చేతివాచి టిక్ టిక్ మంటూ త్వరగా నడుస్తోంది. కాని ఆగంతుకుడు వచ్చే సూచన కానరావటం లేదు.

ఒంటి గంట కూడా అయింది. ఫ్లాస్కులో కాఫీకూడా అయిపోయింది. కళ్లు ముంచుకుని నిద్రవస్తోంది. తను నిద్రిస్తున్న వేళలోవచ్చి తన కమలను కాజేస్తాడేమో. సాధారణంగా తను చదివిన డిటెక్టివ్ కథల్లో హంతకుడు తను ముందుగా తెలియజేసిన సమయానికే వచ్చి, తన పని కాస్త చక్కాచేసుకు పోతున్నాడు. కాని వీడెవడో ఘరానలా వున్నాడు. లేకపోతే ఏంవిటిది? చెప్పిన వేళొకటి, చేసేవేళ ఒకటి. వీడి అంతం ఎదో కనుక్కోవాలి" అనుకున్నాడు తనలో వేణు.

కిర్రుమనకుండా కిటికీ తలుపులు పూర్తిగా తెరచేడు రోడ్డుకేసి చూస్తే కనిపించేలా. దిండులు సర్దుకుని మంచం మీద మేను వాల్చేడు. అప్పటికప్పుడే రెండుగంటలు కొట్టిచాలా సేపయింది. కాని, ఆగంతకుడు వచ్చేజాడ కనిపించ లేదు. చాలానిరుత్సాహ పడ్డాడు వేణు. వూహలు చిమ్నీ గొట్టంనుంచి వచ్చే పొగలా రింగులు రింగులుగా పైకెగసి అనంతాకాశంలో కల్సి పోతున్నాయి. అలానే కళ్లుమూసాడు.

ఆలోచనలకి అంతరాయంకల్గింది. తనగది కిటికీలోనుండి ఎవరోచూసినట్ల యింది. కిటికీ ప్రక్కగా తలనిండుగా ముసుగువేసుకున్న వ్యక్తి సుబ్రమణ్యం గారింటి కిటికీవద్ద నిల్చున్నాడు. మెల్లగా కిటికీ తలుపుల్ని తట్టినట్లుంది. చిన్నగా శబ్దంవినిపించింది. కిటికీ తలుపులు తెరచుకున్నాయి. లోనుండి ఎవరో వ్యక్తి ముసుగువ్యక్తితో మాట్లాడు తున్నట్లుంది. ఆ వ్యక్తి కమలేనని తన దగ్గరనున్న ఆధారాలనుబట్టి నిర్ణయించుకున్నాడు. మరి ఈ ముసుగువ్యక్తి ఎవరు? సమాధానం దొరకలేదు.

గుర్రం సకిలించినట్లయింది. ముసుగువ్యక్తి భయపడ్డాడేమో! భయముగా నలుదిక్కులా చూసేడు. ఏ ప్రమాదం జరగనందుకు సంతోషించా డేమోమరి! సంతోషంగా ఒక సిగరెట్టుని వెనుతిరిగి ముట్టించేడు. లేకపోతే అగ్గిపుల్ల వెలుగులో తను ఆనమాలు పట్టేవాడే. ఎర్రగా వెలుగుతున్న సిగరెట్టు కొన తప్పిస్తే ఆ వ్యక్తిని గురించి ఏమీ తెలియరావటంలేదు.

వీధి తలుపులు తెరచుకున్నట్లున్నాయి. చిన్న శబ్దం వినిపించింది. యిద్దరు వ్యక్తులు తొందరగా తన కిటికీ దాటుకుపోయినట్లయింది. బండి బయల్దేరిన శబ్దమైంది.

తనిన్నాళ్ళు చదివిన పుస్తకాల్లో డిటెక్టివ్‌లకి ఇటువంటి సమస్య లెదుర్కొనే పరిస్థితులు రాలేదు. అంతా అగమ్యగోచరంగావుంది. క్షణం ఆలస్యంచేస్తే కమల తనకు కాకుండా పోతుంది. కమల వినా తన జీవితం కష్టంలో కొరివిలాంటిదే. ఆమె లేనిదే తను ఒక్కక్షణం జీవించటం దుర్లభం. ఆమెకోసం తను తన జీవితాన్నే అర్పించ గలడు.

ఈ విషయాన్నిక దాచటానికి వీలు లేదు. నలుగురికీ చెప్పేయాలి అనుకున్నాడు. అనుకోవడమేమిటి? "మాస్టారూ! కమలను ఎవడో రౌడీ వెధవ ఎత్తుకుపోతున్నాడు. రండి! పదండి! పట్టుకోండి! దొంగ వెధవని" గట్టిగా అరుస్తున్నాడు.

నలుగురూ కిటికీదగ్గరచేరి లేపే వరకూ తనింతసేపూ కలగంటూన్నట్లే తెలియదు వేణుకి. అప్పటికప్పుడే తెల్లవారిపోయింది. తొందరగా గది తలుపులు తెరచేడు. తను చేసిన పనికి చాలా సిగ్గుపడ్డాడు. అప్పటికేదో సమాధానంచెప్పి నలుగుర్నీ పంపించేశాడు. కాని ఎదురుగా కిటికీలోనుండి తనను చూసి ముసిముసినవ్వులు నవ్వుతున్న కమలని చూసేసరికి అంతా అర్ధమైంది వేణుకి. తలతీసినంత పనైం దతనికి ఆ కోపంతో "ఉండు నీపని పట్టిస్తాను" అన్నట్లు చురచుర చూసేడు.

ఆ సాయంకాలం చదరంగం ఆడుతున్నప్పుడు అసలు సంగతంతా తెల్సుకున్న సుబ్రమణ్యంగారు కమలను పిల్చి నాలుగు చీవాట్లేసి, అందుకు తగిన శాస్త్రిగా, శాస్త్రులుగారిని పిలిపించి కమలని వేణుకిచ్చి పెళ్ళిచేయటానికి మహూర్తాన్ని నిర్ణయించేరు. ★

---

## "మా పంతులుగారి కిల్లీ"

నేను మా పంతులు (అంటే నేను పెట్టిన పేరనుకొండి. అసలుపేరు కామేశ్వరరావు) భోజనము ముగించుకున్నాము. భోజనము అయిపోగానే "చిత్రగుప్త" చదువుటలో నిమగ్నుడయిపోయాడు మా పంతులు. నేను కిల్లీ వేసుకుందామని తమలపాకులు, వక్కలు తీశాను. నేను ఆకులు వక్కలు వేసుకుంటూ ఏం పంతులు! ఆకులు వక్కలు వేసుకుంటావా అని అడిగాను. కాని మా పంతులు "మెదడుకు మేతవెయ్యండి" అనే శీర్షికలో లీనమైపోయినందున వద్దండీ నేను వేసుకోను అని అన్నాడు. సరేలే అని నేను ఆకులు వక్కలు వేసుకొని ఏధిగుమ్మమున కెదురుగా కుర్చీ వేసుకొని "నేనెవరిని" అనే పుస్తకం చదువుకొంటున్నాను.

అలాగ ఎంతసేపు చదివానోగాని అకస్మాత్తుగా మా పెరటితోవ వాకిలిదగ్గర కుక్క కతుకుతున్నట్లు వినిపించింది. నేను కుర్చీ నుంచే శబ్దం వస్తున్నవైపు చూశాను. నాకు కుక్క అక్కడ పడుకొనివుండడం నా కళ్లకు కనిపించింది. సరే కుక్క కదా అని ఊరుకున్నాను. కానీ శబ్దం యింకా ఎక్కువగా ఉండుటవలన కుక్కను కొట్టుటవుద్దేశముతో పెరటి వాకిలి దగ్గరకు వెళ్లాను. కాని కుక్క మాత్రం ఏవిధమయిన శబ్దం లేకుండా హాయిగా పడుకొని ఉన్నది. అప్పుడు ఆశబ్దం మా పంతులు ఏదో నములుతూ ఉండటం వలన వస్తున్నదని గ్రహించాను.

అప్పుడు ఏం పంతులు! కుక్కదగ్గర కూర్చొని కిల్లీ నములుతున్నావా అని అడిగాను. వానికి మా పంతులు సమాధానంగా అవునండి కిల్లీ నములుతున్నానని చెప్పాడు. నేను ఎవరిని కొట్టాలో తెలియక నవ్వు వచ్చింది. నాతో పాటు మాపంతులు ఈ హడావుడిచూచి పెద్దపెట్టున నవ్వసాగాడు.

కోపల్లె శ్రీరామచంద్ర శర్మ